ఎరువుల కొరత లేకుండా చూసుకోవాలి

స్థాయీ సంఘ సమావేశాల్లో మాట్లాడుతున్న జడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ

జడ్పీ చైర్‌పర్సన్ వేలేటి రోజాశర్మ

సిద్దిపేట అర్బన్, ఫిబ్రవరి 20 : యాసంగి పంటలకు ఎరువుల కొరత లేకుండా చూసుకోవాలని జడ్పీ చైర్‌పర్సన్ వేలేటి రోజాశర్మ అధికారులను ఆదేశించారు. మంగళవారం సిద్దిపేటలోని జిల్లా పరిషత్ కార్యాలయంలో జడ్పీ చైర్‌పర్సన్ అధ్యక్షతన జిల్లా ప్రజా పరిషత్ స్థాయీ సంఘం సమావేశాలు జరిగాయి. ఎమెల్సీ యాదవరెడ్డి, అధికారులు, జడ్పీటీసీలు జిల్లా పురోగతిపై చర్చించారు. అంతకుముందు ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన జడ్పీ డిప్యూటీ సీఈవో సుమతికి సభ్యులు సంతాపం వ్యక్తం చేశారు.

సెప్టిక్ ట్యాంక్ వర్కర్లు జాగ్రత్తలు తీసుకోవాలి

సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ ఆకుల రజితావెంకన్న

హుస్నాబాద్ టౌన్, ఫిబ్రవరి 20 : సెప్టిక్ ట్యాంక్ వర్కర్లు తగిన జాగ్రత్తలు తీసుకుని పనులు చేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజితావెంకన్న అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో నమస్తే స్కీమ్ ద్వారా అందిస్తున్న సౌకర్యాలపై మంగళవారం అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సెప్టిక్‌ట్యాంక్ వర్కర్లు తప్పకుండా మున్సిపల్ నుంచి లైసెన్స్‌లు పొందాలని సూచించారు. రుణాలు, బీమా సౌకర్యం, వాహనాల కొనుగోలు చేసేందుకు నమస్తే పథకం ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్‌పర్సన్ అనిత, కమిషనర్ మల్లికార్జున్‌గౌడ్, కౌన్సిలర్లు గోవిందు రవి, మ్యాదరబోయిన వేణు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ బాల ఎల్లం, ఎన్విరాన్‌మెంట్ ఇంజినీర్ రవికుమార్, జవాన్లు సారయ్య, ప్రభాకర్, సెప్టిక్‌ట్యాంక్ వర్కర్లు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి



తొగుట : ఘనపూర్‌లో పొద్దుతిరుగుడు పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు

సిద్దిపేటరూరల్/తొగుట, ఫిబ్రవరి 20 : పొద్దు తిరుగుడు పంటలో రైతులు యాజమాన్య పద్ధతులు పాటించాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచించారు. మంగళవారం ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం నుంచి పరిశోధన సంచాలకుడు పి.రఘురామరెడ్డి, తోర్నాల కళాశాల శాస్త్రవేత్త ఎస్.శ్రీదేవి, శాస్త్రవేత్త ఉమారాణి సిద్దిపేట రూరల్ మండలంలోని బుస్సాపూర్, తొగుట మండలం ఘనపూర్‌లో సాగవుతున్న పొద్దుతిరుగుడు పంటలను పరిశీలించారు. జిల్లాలో పొద్దు తిరుగుడు పంట విస్తీర్ణం తగ్గడానికి కారణాలు తెలుసుకున్నారు. అనంతరం తోర్నాల కళాశాలలో రైతులతో సమావేశమై యాజమాన్య పద్ధతులపై పలు సూచనలు చేశారు. వీరి వెంట తొగుట ఏవో మోహన్, వ్యవసాయ విస్తరణ అధికారి దేవేందర్, రైతులు ఉన్నారు.

పంటల సస్యరక్షణకు చర్యలు పాటించాలి

కొమురవెల్లి, ఫిబ్రవరి 20 : రైతులు పంటల సస్యరక్షణకు చర్యలు పాటించాలని జిల్లా వ్యవసాయాధికారి శివప్రసాద్ సూచించారు. మండలంలోని పోసాన్‌పల్లిలో మంగళవారం వరి పొలాలు, ఆయిల్‌పామ్ తోటలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వరి పొలాల్లో కాండం తొలిచే పురుగు ఉధృతి ఉందని, దాని నివారణకు చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఏవో నరేశ్, ఏఈవో ప్రవీణ్ పాల్గొన్నారు.

డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ

సిద్దిపేట అర్బన్, ఫిబ్రవరి 20 : కలెక్టరేట్‌లో గ్రాడ్యుయేట్ వ్యవసాయ విస్తరణ అధికారుల సంఘం డైరీ, క్యాలెండర్‌ను జిల్లా వ్యవసాయాధికారి శివప్రసాద్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏఈవోలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వంలో కరెంట్ కష్టాలు

మాట్లాడుతున్న ఎంపీపీ కొత్త పుష్పలతాకిషన్‌రెడ్డి, పక్క జడ్పీటీసీ రవీందర్‌రెడ్డి

దుబ్బాక, ఫిబ్రవరి 20: కాంగ్రెస్ ప్రభుత్వంలో రైతులకు కరెంట్ కష్టాలు మొదలయ్యాయని దుబ్బాక మండల సర్వసభ్య సమావేశంలో ఎంపీటీసీలు మండిపడ్డారు. మంగళవారం మధ్యాహ్నం దుబ్బాక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ కొత్త పుష్పలతాకిషన్‌రెడ్డి ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యుత్‌శాఖ ఏఈ రామంజనేయులు మాట్లాడుతూ వ్యవసాయానికి ప్రస్తుతం 18 గంటలు కరెంట్ సరఫరా చేస్తున్నామని, ఇందులో సాయంత్రం 5.30 నుంచి రాత్రి 11.30 గంటల వరకు సింగిల్ ఫేజ్, రాత్రి 11.30 నుంచి త్రీ ఫేజ్ కరెంట్ సరఫరా ఉంటుందన్నారు. అనంతరందుబ్బాక నుంచి ముస్తాబాద్‌కు బదిలీపై వెళ్లిన ఎంపీడీవో భాస్కరాశర్మను ఎంపీపీ, జడ్పీటీసీ, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు సన్మానించారు. సమావేశంలో జడ్పీటీసీ రవీందర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ రవి, ఇన్‌చార్జి ఎంపీడీవో శ్యామల, తహసీల్దార్ వెంకట్‌రెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా బోనాల ఊరేగింపు

గజ్వేల్, ఫిబ్రవరి 20: గజ్వేల్ పట్టణంలోని రేణుకా ఎల్లమ్మ దేవాలయ వార్షికోత్సవాన్ని నిర్వాహకులు ఘనంగా నిర్వహిస్తున్నారు. మంగళవారం గౌడకులస్తులు అమ్మవారికి బోనాలు, కల్యాణ మహోత్సవం, ఒడిబియ్యం సమర్పించారు. ఆలయ ప్రాంగణంలోఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. బోనాల ఊరేగింపులో పోతరాజుల విన్యాసాలు, శివసత్తుల జోష్యం ఆకట్టుకున్నాయి. అధిక సంఖ్యలో పట్టణవాసులు తరలివచ్చి బోనాల ఊరేగింపులో పాల్గొన్నారు. ఆలయ ప్రాంగణంలో నిర్వాహకులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. జోగిని అవంతిక బోనాల ఉత్సవాల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కల్యాణోత్సవంలో భక్తులు పాల్గొన్నారు.

బోనం ఎత్తుకున్న జోగిని అవంతిక

హుస్నాబాద్‌లోని ఎల్లమ్మ చెరువు సమీపంలో ముస్తాబైన సమ్మక్క-సారలమ్మ జాతర ప్రదేశం

జాతరలో సమ్మక్క-సారలమ్మ, గోవిందరాజుల గద్దెలు

జాతరకు ఏర్పాట్లు పూర్తి

బెజ్జంకి, ఫిబ్రవరి 20: మండలంలోని దేవక్కపల్లి, గుండారం, వడ్లూర్, తోటపల్లి, ముత్తన్నపేట గ్రామాల్లో నిర్వహించే సమ్మక్క సారలమ్మ జాతరకు నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. దేవక్కపల్లిలో 21 సారలమ్మ గద్దెకురాగా 22న ఉదయం సమ్మక్క గద్దెపైకి రానుంది. దీంతో భక్తులు వనదేవతలకు మొక్కలు చెల్లించుకోనున్నారు. ఉత్సవ కమిటీ సభ్యులు భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేశారు.

జాతరకు పోదాం

- నేటి నుంచి హుస్నాబాద్‌లో సమ్మక్క-సారలమ్మ జాతర
- పట్టణంతోపాటు వివిధ గ్రామాల నుంచి తరలిరానున్న భక్తులు

హుస్నాబాద్, ఫిబ్రవరి 20: హుస్నాబాద్ పట్టణంలోని ఎల్లమ్మ చెరువు సమీపంలో జరిగే సమ్మక్క-సారలమ్మ జాతరకు నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. పెద్ద సంఖ్యలో జాతరకు భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున అందుకు తగినట్లుగా ఏర్పాట్లు చేస్తున్నారు. అమ్మవార్ల గద్దెలు, జాతర ఆవరణ మొత్తం రంగులు వేసి ముస్తాబు చేశారు. బుధవారం నుంచి నాలుగు రోజులు జాతర కొనసాగనుంది. భక్తుల కోసం చలువ పందిళ్లు వేసి, క్యూ కోసం ప్రత్యేక బారికేడ్లు ఏర్పాటు చేస్తున్నారు. జాతర మొదటి రోజు బుధవారం సారలమ్మ అమ్మవారు గద్దెకు చేరుకుంటుంది. గురువారం సమ్మక్క అమ్మవారు గద్దెకు చేరుకోవడంతో పూర్తి స్థాయిలో జాతర ప్రారంభమవుతుంది. శుక్రవారం భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవార్లను దర్శించుకొని మొక్కులు సమర్పిస్తారు. శనివారం సాయంత్రం అమ్మవార్లు వనప్రవేశం చేస్తారు. జాతరకు హుస్నాబాద్ పట్టణం నుంచే కాకుండా చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు తరలివస్తారు. మేడారం జాతరలో జరిగే విధంగానే ఇక్కడ కూడా ఉత్సవాలు జరుగుతాయని, అధిక సంఖ్యలో భక్తులు వచ్చి అమ్మవార్ల కృపకు పాత్రులు కావాలని ఉత్సవ కమిటీ సభ్యులు కోరుతున్నారు.

సమ్మక్క, సారలమ్మ గద్దెల వద్ద ప్రతిష్ఠించిన నాగ ప్రతిమ

నేటి నుంచి అక్కెనపల్లిలో...

నంగునూరు, ఫిబ్రవరి 20 : రెండేండ్లకు ఒకసారి జరిగే సమ్మక్క-సారలమ్మ జాతరకు మండలంలోని అక్కెనపల్లి గ్రామం ముస్తాబైంది. మేడారంలో జరిగే మాదిరిగానే అక్కెనపల్లిలో 40 ఏండ్లుగా జాతర జరగడం ఆనవాయితీగా వస్తున్నది. మేడారం వెళ్లలేని భక్తులు ఇక్కడ మొక్కులు చెల్లించుకుని ప్రత్యేక పూజలు చేస్తారు. సమ్మక్క-సారలమ్మను దర్శించుకునేందుకు మండల పరిధిలోని గ్రామాల నుంచే కాక.. ఇతర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తారు. భక్తులు మొక్కు తీర్చుకునేందుకు నిలువెత్తు బంగారం(బెల్లం), ఒడి బియ్యం సమర్పించి ప్రత్యేక పూజలు చేస్తారు. బుధవారం నుంచి ఈ నెల 23వ తేదీ వర జాతర కొనసాగనున్నది. జాతరలో భాగంగా నేడు సారలమ్మను గద్దెకు తీసుకురావడం, రేపు సమ్మక్కను గద్దెకు తీసుకువచ్చే కార్యక్రమం కనుల పండువగా నిర్వహిస్తారు. శుక్రవారం భక్తులు పెద్ద ఎత్తున సమ్మక్క, సారలమ్మను దర్శించుకుంటారు. శనివారం తిరిగి అమ్మవార్లు వన ప్రవేశం చేస్తారు. ఈ మేరకు భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా ఉత్సవ కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

కూటిగల్‌లో ..

మద్దూరు(ధూళిమిట్ట), ఫిబ్రవరి 20 : ధూళిమిట్ట మండలంలోని కూటిగల్ మినీ మేడారంగా విరాజిల్లుతున్నది. 30 ఏండ్ల క్రితం గ్రామంలో పాటిగడ్డ బావుల సమీపంలో వెదురు పొదల్లో పసుపు-కుంకుమ రూపంలో సమ్మక్క-సారలమ్మలు గ్రామస్తులకు దర్శనమిచ్చారు. అప్పటి నుంచి గ్రామంలో ప్రతి రెండేండ్లకు ఒకసారి వనదేవతల పండుగను అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారు. మేడారం నుంచి వచ్చిన కోయపూజారుల ఆధ్వర్యంలో గిరిజన సంప్రదాయ పద్ధతుల్లో అమ్మవార్లకు పూజలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తున్నది. నల్ల చెరువు సమీపంలో పచ్చని చెట్ల మధ్య వనదేవతలు భక్తులకు దర్శనమిస్తున్నారు. గ్రామంలో నేటి నుంచి ఈ నెల 24వరకు సమ్మక్క-సారలమ్మ జాతర కొనసాగనున్నది. నేడు సారలమ్మదేవత గద్దెకు రావడం, 22న సమ్మక్క దేవత గద్దెకు రావడం, 23న వనదేవతలకు మొక్కులు చెల్లించడం, 24న సమ్మక్క-సారలమ్మల వనప్రవేశం జరుగుతుందని జాతర కమిటీ చైర్మన్ కొండూరి శ్రీనివాస్ తెలిపారు.

కూటిగల్‌లోని సమ్మక్క-సారలమ్మ గద్దెలు

భక్తులకు సౌకర్యాలు కల్పించాం

హుస్నాబాద్ టౌన్, ఫిబ్రవరి 20: సమ్మక్క, సారలమ్మకు వచ్చే భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించినట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజితావెంకన్న అన్నారు. స్థానిక ఎల్లమ్మచెరువుకింద ఉన్న సమ్మక్క, సారలమ్మ జాతర ఏర్పాట్లను మంగళవారం ఆమె పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఈనెల 21 నుంచి 24వ తేదీవరకు సమ్మక్క, సారలమ్మ జాతర కొనసాగుతుందన్నారు. జాతరకు వచ్చే భక్తుల కోసం క్యూలైన్, తాగునీరు, విద్యుత్ సౌకర్యాలు కల్పించామన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్‌పర్సన్ అయిలేని అనిత, కమిషనర్ మల్లికార్జున్ గౌడ్, మాజీ ఎంపీపీ ఆకుల వెంకట్, కౌన్సిలర్లు పున్న సదిలావణ్య, గోవిందు రవి, వల్లపు రాజు, మ్యాదరబోయిన వేణు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ బాల ఎల్లం, వాల నవీన్ పాల్గొన్నారు.

హుస్నాబాద్ టౌన్ : సమ్మక్క- సారలమ్మ జాతర ఏర్పాట్లను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజితావెంకన్న తదితరులు

ఆర్టీసీ డ్రైవర్లకు ఉచిత అల్పాహారం

హుస్నాబాద్, ఫిబ్రవరి 20: హుస్నాబాద్ వాసవీ వనితక్లబ్ ఆధ్వర్యంలో మేడారం జాతరకు బస్సులు నడిపే ఆర్టీసీ డ్రైవర్లకు ఉచిత అల్పాహారం అందించే కార్యక్రమాన్ని డిపో మేనేజర్ వెంకటేశ్వర్లు మంగళవారం బస్టాండ్ ఆవరణలో ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఎం మాట్లాడుతూ మేడారం జాతరకు 67 బస్సులు నాలుగు రోజులు నిరంతరం నడుస్తాయని తెలిపారు. జాతర డ్యూటీలో ఉండే డ్రైవర్లకు ఉదయం బస్టాండ్ ఆవరణలో నాలుగు రోజులు ఉచితంగా అల్పాహారం అందించేందుకు వాసవి క్లబ్ వారు ముందుకు రావడం అభినందనీయమన్నారు. జాతర డ్యూటీ బిజీలో ఉండే డ్రైవర్లకు కొంత ఉపశమనంగా ఉంటుందన్నారు. డ్రైవర్లు, ఇతర జాతర డ్యూటీ చేసే ఆర్టీసీ ఉద్యోగులు దీనిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కంట్రోలర్ వెంకన్న, వాసవీవనితక్లబ్ అధ్యక్షురాలు రాగి కవిత తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా జాతర్లు జరిగేలా కృషి..

హుస్నాబాద్ పోలీసు సబ్‌డివిజన్ పరిధిలో బుధవారం నుంచి జరుగనున్న సమ్మక్క-సారలమ్మ జాతర్లు ప్రశాంతంగా జరిగేలా భక్తులు సహకరించాలని ఏసీపీ సతీశ్ వాసాల కోరారు. హుస్నాబాద్ పట్టణ శివారులోని ఎల్లమ్మ చెరువు సమీపంలోని జాతర స్థలంతో పాటు అక్కన్నపేట మండలం గోవర్ధనగిరిలో జరిగే జాతర ప్రదేశాన్ని ఆయన స్థానిక పోలీసు అధికారులతో కలిసి సందర్శించారు. ఆయా జాతర్లలో భక్తుల కోసం ఏర్పాటు చేసిన సౌకర్యాలపై ఉత్సవ కమిటీ సభ్యులతో చర్చించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ డివిజన్ పరిధిలో 8పోట్ల జాతర్లు జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో సీఐ ఎర్రల కిరణ్, ఎస్సై వివేక్ పాల్గొన్నారు.

పారిశుధ్య పనుల పరిశీలన

గజ్వేల్, ఫిబ్రవరి 20 : మున్సిపల్ పరిధిలోని ఐదో వార్డులో మంగళవారం ఉదయం మున్సిపల్ చైర్మన్ రాజమౌళి, వార్డు కౌన్సిలర్ శ్యామలామల్లేశంతో కలిసి పారిశుధ్య పనులను పరిశీలించారు. వార్డులో అవసరమైన ప్రదేశాల్లో మురుగుకాల్వల నిర్మాణాలు చేపట్టాలని, అందుకు తగిన నిధులు మంజూరు చేయాలని కౌన్సిలర్ కోరారు. త్వరలోనే సమస్య పరిష్కారం కోసం నిర్ణయం తీసుకుంటామన్నారు.

వరి పంటకు తీరని నష్టం

హుస్నాబాద్‌టౌన్, ఫిబ్రవరి 20: మొగిపురుగుతో వరిపంటకు తీరని నష్టం జరుగుతుందని, దీని నివారణ చర్యలపై రైతులు దృష్టిసారించాలని ఏఈవో శివరామ్ అన్నారు. హుస్నాబాద్ రైతువేదికలో మొగిపురుగు నివారణపై మంగళవారం రైతులకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మొగిపురుగు నివారణకు నారుపోసిన 15రోజుల్లోనే కార్టాప్‌హైడ్రోక్లోరైడ్ గుళికలను ఇసుకలో కలిపి చల్లాలని సూచించారు. వరుసగా వరిపైరు సాగు చేస్తే పంట దిగుబడి తగ్గుతుందని చెప్పారు. రైతులు ఎప్పటికప్పుడు వరిపైర్లను గమనిస్తూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ బొలిశెట్టి సుధాకర్, రైతులు అయిలేని సంజీవరెడ్డి, కాయిత బాల్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, నాగార్జున్ పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

హుస్నాబాద్, ఫిబ్రవరి 20: సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సీఐ ఎర్రల కిరణ్ అన్నారు. మంగళవారం హుస్నాబాద్‌లోని సీవీ రామన్ హైస్కూల్‌లో షీటీమ్ ఆధ్వర్యంలో విద్యార్థులు, ఉపాధ్యాయులకు ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. సెల్‌ఫోన్‌కు వచ్చే కాల్స్, మెసేజ్‌లను నమ్మి మోసపోవద్దన్నారు. విద్యార్థినులు, మహిళలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం నారాయణరెడ్డి, షీటీమ్ బృందం సభ్యులు సైదయ్య, స్వప్న, ప్రశాంతి, కృష్ణ, శివకుమార్ పాల్గొన్నారు.

ఇసుక లారీ పట్టివేత

మద్దూరు(ధూళిమిట్ట), ఫిబ్రవరి 20 : ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న ఓ లారీని పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై షేక్ యూనూస్‌అహ్మద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏఎస్సై జగదీశ్వర్ ఆధ్వర్యంలో సోమవారం రాత్రి నర్సాయపల్లి-రాంపూర్ క్రాసింగ్ వద్ద పెట్రోలింగ్ నిర్వహిస్తున్న క్రమంలో ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న లారీని పట్టుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

'మల్లన్న' క్షేత్రాభివృద్ధికి సహకరించాలి

రాజ్యసభ సభ్యుడికి స్వామివారి చిత్రపటం అందజేస్తున్న చైర్మన్, అర్చకులు

చేర్యాల, ఫిబ్రవరి 20 : కొమురవెల్లి మల్లికార్జునస్వామి క్షేత్రాభివృద్ధికి సహకరించాలని కోరుతూ మల్లన్న ఆలయ పునరుద్ధరణ కమిటీ చైర్మన్ పర్వాటకం లక్ష్మారెడ్డి ,ఆలయ అర్చకులు రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్ యాదవ్‌ను మంగళవారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిశారు.రాజ్యసభ సభ్యుడిగా అనిల్‌కుమార్ యాదవ్ ధ్రువీకరణ పత్రం అందుకున్న సందర్భంగా ఆలయవర్గాలు ఆయన్ను కలిసి స్వామి వారి చిత్రపటంతో పాటు ప్రసాదాలు అందజేశారు. అనంతరం ఆలయ అర్చకులు రాజ్యసభసభ్యుడితో పాటు వారి కుటుంబ సభ్యులకు ఆశీర్వచనాలు అందజేశారు.

'మల్లన్న' గుట్ట పై మంటలు

చేర్యాల, ఫిబ్రవరి 20 : కొమురవెల్లి మల్లికార్జునస్వామి గుట్ట పై భాగంలో సోమవారం రాత్రి మంటలు చలరేగాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా మల్లన్న క్షేత్రం నుంచి మెట్ల మార్గంలో కాలినడకన రేణుకా ఎల్లమ్మ అమ్మవారి ఆలయానికి చేరుకునే దారిలో రాత్రి మంటలు ఎగిసిపడడంతో క్షేత్రంలోని వ్యాపార, వాణిజ్యవర్గాలు ఆందోళనకు గురయ్యాయి. ఈ ఘటనలో ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో భక్తులతో పాటు గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు. గుర్తుతెలియన వ్యక్తులు ఏదైనా అగ్గి వేయడంతో మంటలు చెలరేగి ఉండవచ్చని ఆలయవర్గాలు తెలిపాయి.

ఆలయ హుండీల లెక్కింపు

మద్దూరు(ధూళిమిట్ట), ఫిబ్రవరి 20: ధూళిమిట్ట మండలంలోని బెక్కల్ రామలింగేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం హుండీ ఆదాయాన్ని లెక్కించారు. ఆలయ ఈవో పార్నంది విశ్వనాథశర్మ పర్యవేక్షణలో 2 మార్చి 2023 నుంచి నేటి వరకు ప్రధాన ఆలయ హుండీతో పాటు ఉప ఆలయాల హుండీలను లెక్కించారు. ఈ లెక్కింపులో ఆలయానికి రూ.2,01,367 ఆదాయం సమకూరింది. ఆలయానికి వచ్చిన ఆదాయాన్ని ధూళిమిట్ట మండల కేంద్రంలోని ఎస్‌బీఐలో జమ చేశారు. కార్యక్రమంలో ఏఎస్సై విజయ్‌కుమార్, ఆలయ అర్చకుడు సిద్ధాపురం భద్రప్ప, దేవాదాయ శాఖ అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రామలింగేశ్వరస్వామి ఆలయ హుండీలను లెక్కిస్తున్న అధికారులు

డీఆర్‌డీవో పీడీ మధుసూదన్‌ను సన్మానిస్తున్న ఐకేపీ సిబ్బంది

లక్ష్యాన్ని పూర్తిచేయాలి

రాయపోల్, ఫిబ్రవరి 20 : అనుకున్న లక్ష్యాలను వెంటనే పూర్తి చేయాలని డీఆర్డీవో పీడీ మధుసూదన్ అన్నారు. మంగళవారం దౌల్తాబాబాద్ ఐకేపీ కార్యాలయంలో రాయపోల్, దౌల్తాబాద్ మండలాలకు చెందిన ఐకేపీ సిబ్బందితో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాంక్ రుణాలు వంద శాతం ఇప్పించాలని ఆదేశించారు. అర్హులైన మహిళా గ్రూపులకు వెంటనే రుణాలు అందించే విధంగా ఐకేపీ సిబ్బంది కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో డీపీఎం ఐబీ విద్యాసాగర్, స్త్రీనిధి ఫైనాన్స్ అధికారి శ్రీనివాస్, దౌల్తాబాద్, రాయపోల్ మండలాల ఐకేపీ ఏపీ ఎంలు కిషన్, దుర్గాప్రసాద్, సీసీలు పాల్గొన్నారు.

జడ్జిలను కలిసిన ఏసీపీ

గజ్వేల్, ఫిబ్రవరి 20: గజ్వేల్ ప్రిన్సిపల్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ వి.సౌమ్య, అడిషనల్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ ప్రియాంకలను మంగళవారం గజ్వేల్ ఏసీపీ బాలాజీ మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్కలు అందజేశారు. ఈసందర్భంగా పెండింగ్‌లో ఉన్న ట్రయల్ కేసులపై వచ్చే నెల తొమ్మిదో తేదీన జరిగే లోక్‌అదాలత్‌పై చర్చించారు. బార్ అసోసియేషన్ సభ్యులు కోర్టు వద్ద ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని తెలుపగా ప్రమాదాలు జరిగే ప్రదేశాన్ని పరిశీలించి త్వరలోనే సంబంధిత అధికారులతో మాట్లాడి స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటానన్నారు.

పెండింగ్ కేసులు పరిష్కరించాలి..

గజ్వేల్, ఫిబ్రవరి 20: పెండింగ్‌లో కేసులను త్వరగా పరిష్కారించాలని, కేసుల దర్యాప్తు పారదర్శకంగా ఉండాలని ఏసీపీ బాలాజీ అన్నారు. ఏసీపీ కార్యాలయంలో డివిజన్ పరిధిలోని ఎస్‌హెచ్‌వోలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేసుల విషయంలో ప్రతి అధికారి తప్పకుండా ఘటనాస్థలాన్ని సందర్శించాలన్నారు. సీఐలు సైదా, లతీఫ్, ఎస్సైలు లింగం, రవి కాంతారావు, విజయ్ సిబ్బంది పాల్గొన్నారు.

జడ్జికి పూల మొక్క అందజేస్తున్న ఏసీపీ

రోటరీ క్లబ్ సేవలు అభినందనీయం

ములుగు, ఫిభ్రవరి 20 : రోటరీ క్లబ్ సేవలు అభినందనీయమని గజ్వేల్ ఏసీపీ బాలాజీ అన్నారు. మంగళవారం మండలంలోని లక్ష్మక్కపల్లి వీపీజే ఫంక్షన్‌హాల్‌లో రోటరీక్లబ్ ఆఫ్ గజ్వేల్ అధ్యక్షుడు కుక్కల బాబుగౌడ్, ఉపాధ్యక్షుడు నరసింహారెడ్డి, ట్రెజరీ శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో 150 మంది పేద విద్యార్థులకు ఉచితంగా సైకిళ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రోటరీ ఇంటర్నేషనల్ జిల్లా గవర్నర్ పీజీడీ రవి, రోటరీక్లబ్ గవర్నర్ ఉదయ్‌పిల్లాని, సభ్యులు చంటి, కరుణాకర్‌రెడ్డి, మురళీధర్‌రెడ్డి, పురుషోత్తం, జగదీశ్వర్, నరసింహారెడ్డి, నరేశ్‌గౌడ్, విష్ణు జగతి, బాపురెడ్డి పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న నాయకులు

సమస్యలు పరిష్కరించాలి

సిద్దిపేట టౌన్, ఫిబ్రవరి 20 : రైతుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని తెలంగాణ రైతు రక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు పాకాల శ్రీహరిరావు డిమాండ్ చేశారు. మంగళవారం రైతులతో కలిసి సిద్దిపేట రైతు బజార్‌లో నిరసన తెలిపారు.కార్యక్రమంలో మారెడ్డి రామలింగారెడ్డి, రాజేశం, శ్రీనివాస్, విష్ణువర్ధన్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, లక్ష్మయ్య, దేవేందర్,యాదంరావు,మధుసూదన్‌రెడ్డి,భూపతిరెడ్డి,రాజనర్సయ్య, చంద్రారెడ్డి పాల్గొన్నారు.

కరువు భత్యం చెల్లించాలి

సిద్దిపేట టౌన్, ఫిబ్రవరి 20 : బీడీ కార్మికులకు పెరిగిన కరువు భత్యం (వీడీఏ) వెంటనే చెల్లించాలని హెచ్ఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ఇదారి మల్లేశం డిమాండ్ చేశారు. సిద్దిపేటలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీడీ పరిశ్రమలో పనిచేస్తున్న కార్మికులకు కరువు భత్యం పెరిగిందని, దాన్ని వెంటనే అమలు చేయాలన్నారు. సమావేశంలో బీడీ కార్మిక సంఘం నాయకులు మధు, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబ